అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 06 మే 2023

పోగొట్టుకున్న ఫోన్‌ని ట్రేస్ చేసి పట్టుకున్నారు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



అదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలానికి చెందిన ఉపాధ్యాయుడు రమేష్ గత నెల రోజుల క్రితం తన మొబైల్ పోగొట్టుకున్నాడు. గత రెండు రోజుల క్రితం సిఈఐఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. దింతో మావల పోలీస్ స్టేషన్ పోలీసులు మొబైల్‌ను ట్రెస్ చేసి పట్టుకున్నారు. శుక్రవారం మావల ఎస్సై వంగ విష్ణువర్ధన్ బాధితుడికి ఫోన్ అప్పజెప్పాడు. దింతో ఆయన కృతజ్ఞతలు తెలిపారు ఎవరైనా ఫోన్ పొగుట్టుకుంటే సిఈఐఆర్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అథ్లెటిక్స్ ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-నస్పూర్



వేసవి అథ్లెటిక్స్ ఉచిత శిక్షణ శిబిరాన్ని శుక్రవారం సీతారాంపల్లిలోని జడ్పీహెచ్ఎస్ లో స్థానిక కౌన్సిలర్ సురిమిల్ల వేణు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరాన్ని క్రీడాకారులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మే 31 వరకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీ మారయ్య, గ్రామస్తులు ఆరికే భూమయ్య పాల్గొన్నారు.

పల్లెల్లో పరేషాన్..!

- సమ్మెలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- గ్రామాల్లో మందగించిన రోజువారీ పనులు
- ప్రత్యమ్నాయ సిబ్బందికి తప్పని అదనపు భారం
- ఉధృతమవుతున్న కార్యదర్శుల నిరసన

పల్లెలను పరిరక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శులు సమ్మె బాట పట్టారు. వారం రోజులుగా విధులు బహిష్కరించి నిరసన తెలుపుతుండటంతో పల్లెల్లో రోజువారీ పనులకు ఆటంకం కలుగుతోంది. ప్రభుత్వం క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేయడంలో ఆలస్యం చేయడంతో పంచాయతీ కార్యదర్శులు పట్టువీడటం లేదు. ప్రభుత్వం స్పందించాలని కోరుతూ వివిధ రూపాల్లో నిరసన తెలుపుతూ మరింత ఉధృతం చేయాలని భావిస్తున్నారు. వీరికి వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు సమ్మె శిబిరానికి వచ్చి మద్దతు తెలుపుతున్నారు. పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉండటంతో వీరి స్థానంలో పల్లెల్లో పనులను పర్యవేక్షించేందుకు ప్రత్యామ్నాయంగా అధికారులు, సిబ్బందిని నియమించారు. ఒక్కొక్కరికి పదుల సంఖ్యలో బాధ్యతలు అప్పగించడంతో వీరికి కూడా అదనపు భారంగా మారుతోందని తెలుస్తోంది.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పల్లెలను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం గ్రామానికో పంచాయతీ కార్యదర్శిని నియమించింది. ప్రభుత్వం నోటిఫికేషన్ వేసి నియామకాలు చేపట్టింది. రాత పరీక్ష ద్వారా ఎంపికై ఉద్యోగంలో చేరిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం నాలుగేండ్ల పాటు ప్రొహిబేషన్ పీరియడ్ నిర్ధారించింది. నాలుగేండ్లు పూర్తయితేనే ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని అప్పట్లో స్పష్టం చేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కిందటి ఏప్రిల్ నెల 11వ తేదీతో ప్రొహిబేషన్ పీరియడ్ పూర్తయింది. అదే నెల 12వ తేదీ నుంచి సర్వీసు క్రమబద్ధీకరించాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం వీరి రెగ్యూలరైజేషన్‌కు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో జేపీఎస్‌లు కిందటి నెల 28వ తేదీ నుంచి సమ్మె బాట పట్టారు. సమ్మె మా హక్కు కాదు..ఆవేదన మాత్రమేననే నినాదంతో నిరసన బాట పట్టారు. వీరికి ప్రతిపక్ష పార్టీలతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు స్వచ్ఛందంగా వచ్చి సంఘీభావం తెలుపుతున్నారు. వారం రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో సమ్మెను మరింత ఉధృతం చేయాలని భావిస్తున్నారు.

నిలిచిపోయిన పనులు..!

పల్లెలను ప్రగతిపథంలో నిలబెడుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులు బహిష్కరించడంతో అభివృద్ధి పనులకు ఆటకం ఏర్పడుతోంది. ఉమ్మడి జిల్లాలో 1485 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 882మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. రోజువారీ శానిటేషన్ నిర్వహణ, గ్రామసభలు నిర్వహించడం, అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మాణాలు చేయడం, పల్లె ప్రకృతి వనాలు, ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ, పింఛన్లకు దరఖాస్తు చేయడం, సేంద్రీయ ఎరువుల తయారీ, జనన, మరణ ధ్రువీకరణపత్రాల జారీ తదితర 46 రకాల పనులు చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం వీరు విధుల్లో లేకపోవడంతో ఆయా పనులన్ని మందగమనంలో సాగుతున్నాయి. అధికార యంత్రాంగం వీరికి ప్రత్యామ్నాయంగా రెగ్యూలర్ పంచాయతీ కార్యదర్శులు, మండల కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, ఎంపీఓలు తదితర అధికారులకు బాధ్యతలు అప్పగించారు. కానీ కొందరే ఉండటంతో ఒక్కొక్కరికి ఐదు నుంచి పది పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. ఒక్కో పంచాయతీకి ఒక కార్యదర్శి ఉన్న సమయంలోనే అన్ని పనులు నిర్వహించడం భారంగా మారుతుంది. అలాంటిది ప్రస్తుతం ప్రత్యామ్నాయం పేరుతో ఒక్కో అధికారికి పదుల సంఖ్యలో కేటాయించడంతో పల్లెల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు లేకపోవడంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. రోజువారీగా చేపట్టాల్సిన పనులకు ఆటకం కలుగుతుండటంతో అసహనానికి గురవుతున్నారు. ఆయా జిల్లాల్లో కొందరు సర్పంచ్‌లు స్వచ్ఛందంగా సమ్మె శిబిరానికి వచ్చి సంఘీభావం తెలుపుతుండటం..పంచాయతీ కార్యదర్శుల ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది.



జీఓ వచ్చే వరకు కొనసాగుతుంది

చంద్రశేఖర్, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు



ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సమ్మె బాట పట్టాం. రోజువారీగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మా ఉద్యోగాలను రెగ్యూలర్ చేయాల్సి ఉన్నా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ప్రభుత్వం స్పందించి అధికారికంగా జీఓ జారీ చేసే వరకు సమ్మె కొనసాగుతుంది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం

శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి



జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉండటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. ఆయా గ్రామాలకు ఇన్‌ఛార్జీలను నియమించాం. రోజువారీగా చేపడుతున్న పనులను పర్యవేక్షిస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడా పారిశుధ్యం సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపల్లి, విలేజ్ నస్పూర్‌లో వరి కొనుగోలు కేంద్రాలను మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని, రైతులందరూ దళారులను నమ్మి మోసపోకుండా సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. రైతు కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సందేల వెంకటేష్, నస్పూర్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బయ్య పాల్గొన్నారు.

కోటపల్లి : మండలంలోని దేవులవాడ గ్రామంలో శుక్రవారం వైస్ ఎంపీపీ వాల శ్రీనివాసరావు పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో మాత్రమే విక్రయించాలని సూచించారు. రైతులు దళారుల మాటలు నమ్మి వరి ధాన్యాన్ని దళారులకు అమ్మొద్దని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రైతుల జీవితాల్లో వెలుగులు నిండాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పండించిన ప్రతి గింజని కొనుగోలు చేస్తుందని, రైతులకు కనీస మద్దతు ధర ఇస్తుందని రైతులందరూ వరి కొనుగోలు కేంద్రాలలో మాత్రమే వరి ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. వరి కొనుగోలు కేంద్రం నిర్వాహకులు వరి ధాన్యం తూకం విషయంలో ఏమైనా అవకతవకలు చేసినట్లయితే రైతులు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రతి రైతు 40 కిలోల కంటే ఎక్కువ తూకం వేయకూడదని అన్నారు. కొనుగోలు విషయంలో రైతుల నుంచి ఏమైనా ఫిర్యాదు వస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు మారిశెట్టి విద్యాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ సాంబ గౌడ్, ఏఎంసి డైరెక్టర్ గాదె శ్రీనివాస్, సర్పంచ్ గోనె సత్యనారాయణ పాల్గొన్నారు.

17న జన్నారంలో సీఎం క్రీడలు

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో చీఫ్ మినిస్టర్ కప్ క్రీడలను నిర్వహించాలని మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్ణయించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మాదాడి సరోజన ప్రభుత్వ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మే 17న మండల కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాల మైదానంలో చీఫ్ మినిస్టర్ కప్ క్రీడలు నిర్వహిస్తామని వారు వెల్లడించారు. ఇందులో కోకో, వాలీబాల్ కబడ్డీ, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనేవారు ఈ నెల 13వ తేదీన జట్టుల, పేర్లతో ఎంపీడీఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందులో గెలుపొందిన విజేతలను జిల్లాస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. ఉత్సాహంగా ఉన్నవారు ఈ ఆటల పోటీలలో పాల్గొనాలని మండల వాసులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, తహసీల్దార్ ఇట్యాల కిషన్, ఎంపీడీఓ అరుణ రాణి, స్థానిక అదనపు ఎస్సై తానాజీ నాయక్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ ఉచిత శిక్షణ

నవతెలంగాణ-జన్నారం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల్ఫ్ దేశాల నుంచి తిరిగి వచ్చిన కార్మికులకు ఇంటర్నేషనల్ ఆర్గనైజషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఓఎం) ఆధ్వర్యంలో ఉచితంగా హెవీ మోటర్ వెహికిల్ డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్టు గల్ఫ్ సంక్షేమ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆమరకొండ తిరుపతి, శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉచిత శిక్షణలో, శిక్షణ పొందే వారికి ఉచిత భోజనం, వసతి, ప్లేస్‌మెంట్ సౌకర్యం కల్పింస్తున్నట్టు తెలిపారు. ఈ శిక్షణ 30 రోజుల పటు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నెల 16 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు తప్పనిసరిగా 22-35 సంవత్సరాలు వయోపరిమితి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న గల్ఫ్ దేశాల నుండి తిరిగి వచ్చిన కార్మికులు తమ, లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్, హెవీ మోటార్ వెహికల్ లినెర్స్ లైసెన్సను, పూర్తి వివరాలు డాక్టర్ త్రిలోక్ చందన్ గౌడ్ (వాట్సప్-9493460031), సంప్రదించాలన్నారు.

కార్యకర్తలకు, ప్రజలకు అండగా ఉంటా

నవతెలంగాణ-జన్నారం

ప్రతి కార్యకర్తకు, ప్రజలకు అండగా ఉంటానని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని తపాలాపూర్ గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ గ్రామానికి చెందిన లక్ష్మణ్ గౌడ్, ఈత చెట్టుపై నుంచి పడి కాలు విరగడంతో అతన్ని పరామర్శించారు. రాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకురాలు, గీత సోదరుని వివాహానికి వెళ్లి వివాహ కానుకలను అందించారు. తపాలపుర్ గ్రామానికి చెందిన దాడి తిరుపతి నిశ్చితార్థానికి వెళ్లి, కానుకను అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ముత్యం సతీష్, శ్రీపతి బుచ్చన్న, మండల కోఆప్షన్ సభ్యుడు అలీ ఖాన్, సర్పంచ్ నైనాల తిరుపతి, మండల మహిళా కమిటీ అధ్యక్షురాలు సుశీల, గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు పన్నాల విజయ్, బీవీఎస్ నాయక్ పాల్గొన్నారు.

అవినీతి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని నిరసన



ఆసిఫాబాద్ : దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి దళిత బందులో అవినీతి జరిగిందని ఎమ్మెల్యేల సమక్షంలో పత్రిక ముఖంగా మాట్లాడారని గుర్తు చేశారు. దళితుల ఆర్థిక పరిస్థితి మార్చడానికి రూపొందించిన పథకంలో ఎమ్మెల్యేలు అక్రమాలకు పాల్పడడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి దగ్గర ఎమ్మెల్యేల చిట్టా బయటపెట్టి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్‌పీఎస్ జిల్లా కోకన్వీనర్ రేగుంట మహేష్, నాయకులు రేగుంట సాగర్, విష్ణుమోహన్, తోట రాంచందర్, శ్రీనివాస్, బాపు, వెంకన్న, మాటూరి దుర్గ ప్రసాద్, రమేష్, అశోక్, శ్రావణ్ పాల్గొన్నారు.

మార్క్సిజమే సమాజాభివృద్ధికి మార్గం

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కారల్ మార్క్స్ 205వ జయంతి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ప్రపంచ కార్మికవర్గాన్ని, పెట్టుబడి దారి వ్యవస్థ చేస్తున్న దోపిడీ గుట్టును విప్పి చెప్పిన మహనీయుడు కారల్ మార్క్స్ అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. కారల్ మార్క్స్ 205వ జయంతిని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1818లో జర్మనీలో పుట్టిన మార్క్స్ నేడు ప్రపంచం గుర్తించ దగినవాడుగా ఎదిగాడని అన్నారు. అందుకుకారణం కార్మికవర్గ సిద్ధాంతం కనిపెట్టడమే అన్నారు. పెట్టుబడి దారి సమాజంలో సంపదా కొంతమంది చేతిలో పోగుపడుతుందని, ఎక్కువమంది పేదలు, దరిద్రంతో కొట్టుమిట్టాడుతారని మార్క్స్ ముందుగానే గుర్తించారని తెలిపారు. కార్మిక వర్గం శ్రమను దోచుకొని అదనపు లాభాలు గడించే పద్ధతి పెట్టుబడి దారీ విధానంలో అంతర్భాగంగా ఉంటుందని ఆనాడే తెలిపారన్నారు. 1848లో కమ్యూనిస్టు ప్రణాళికను రచించి ప్రపంచ కార్మికులారా ఏకం కండి, పోరాడితే పోయేదిలేదు బానిససంకెళ్లు తప్ప అని పిలుపునిచ్చారని తెలిపారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల నిజవేతనాలు తగ్గిపోయి, కంపెనీలు మూతపడి నిరుద్యోగం పెరుగుతుందన్నారు. ఐటీ కంపనీల్లో ఇది మరింత పెరిగిందన్నారు. ప్రపంచంలో చాల దేశాలు ఆకలితో అలమటిస్తున్నాయని, దానికి విరుద్ధంగా కొంత మంది సంపన్నుల దగ్గర సంపద పోగవుతోందన్నారు. మన దేశంలో ఆదానీ ఆస్తులు పెరగడం ఇందుకు మంచి ఉదాహరణ 2014లో అంతర్జాతీయ సంపన్నుల్లో 609వ స్థానంలో ఉన్న ఆదానీ నేడు 2022కు వచ్చే సరికి రెండవస్థానంలోకే దూసుకుపోయారన్నారు. మరో పక్క ఆకలి సూచీలో దేశం 106వ స్థానంలో ఉండడమే నిదర్శనం అన్నారు. పెట్టుబడిదారి వ్యవస్థను కూల్చడానికి కార్మికవర్గం అనే ఆయుధ్ధాన్ని కూడా పెట్టుబడి దారి వ్యవస్థనే సృష్టించుకుంటుందని మార్క్స్ చెప్పారని పేర్కొన్నారు. పెట్టుబడి దారి వ్యవస్థ తనగోతిని తనే తవ్వుకుంటుందని ఈ ఉద్దేశ్యంతోనే మార్క్స్ చెప్పారని అన్నారు. మార్క్స్ ఆశయాలను కార్మికవర్గం ముందుకు తీసుకెళ్లాలని ఆ విధానాలే కార్మిక వర్గం విముక్తికి మార్గం చూపగలవారని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అన్నమొళ్ళ కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.గంగన్న, ఆర్.మంజుల నాయకులు చిల్ల సుజాత పాల్గొన్నారు.

ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతి



నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం బుద్ధ జయంతిని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జశ్వంత్ బుద్ధవిహార్‌లో అంబేద్కర్ సంఘం నాయకుడు ఉప్రె జయరాం పంచశీల జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. మండలంలోని కమాన, కన్నర్‌గావ్, ఇందాని, బెండారా, ఎనోళి, లొద్దిగూడ, ఎనగొంది తదితర గ్రామాల్లో జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బుద్ధిస్టు సొసైటీ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు మౌల్కార్ అశోక్, బౌద్ధ మహాసభ అధ్యక్షుడు ఉప్రె జయరాం, విజయ్, శ్యాంరావు, సునీల్, విలాస్, పండిత్, పాండు, జయంత్‌కుమార్, విఠల్, రోశన్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : గౌతమ్ బుద్ధుని 2567 జయంతి వేడుకలను మండలంలోని అంక్సాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ నాయకుడు రేగుంట కేశవ్ మాట్లాడుతూ గొప్ప జ్ఞాన సంపన్నుడు గౌతమ బుద్ధుడని కొనియాడారు. సమాజంలోని మార్పులను కోరుకుని రాజ్యాన్ని సైతం త్యజించి బోధి వృక్షం కింద తపస్సు చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు రేగుంట యశోద, ఎమ్మార్పీఎస్ నాయకులు రేగుంట మహేష్, స్వామి, వెంకట్, తిరుపతి, రేగుంట భాను, వెంకటేష్ పాల్గొన్నారు.

జోరుగా గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం



నవతెలంగాణ-కోటపల్లి

హత్ సే హత్ జోడో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాంగ్రెస్ చెన్నూర్ నియోజకవర్గ పీసీసీ సభ్యులు నూకల రమేష్ మండలంలోని వెంచపల్లి గ్రామంలో ప్రతి గడపగడపకు కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ పార్టీని అధికారంలోకి తీసుకొస్తే తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులు బ్యాంకుల దగ్గర తీసుకున్న పంట రుణాన్ని మాఫీ చేస్తామని తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని అన్నారు. గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించి రూ.500కి విక్రయిస్తామని తెలిపారు. తెలంగాణను ఇచ్చిన కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావటం మనందరి కర్తవ్యమని అన్నారు. మాయ మాటలు చెప్పే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎవరు నమ్మరని అన్నారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్ వల్ల కోటపల్లి మండలంలోని నది పరివాహక ప్రాంతాలు నీట మునిగిన ఇప్పటివరకు పంట నష్ట పరిహారం అందించే స్థితిలో కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేదంన్నారు. ప్రతి ఒక్కరు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిసేలా వివరించాలని, మండలంలోని నాయకులు వారి జేబులు నింపుకోవడానికి తప్ప రైతులను కానీ, దళిత, పేద వర్గాల అభివృద్ధికి ఏనాడు పాటుపడలేదని విమర్శించారు. దళిత బంధు పథకం ప్రవేశపెట్టి ఎమ్మెల్యే, ఎంపీ వారి సన్నిహితులకు ఇచ్చారు తప్ప ఏ ఒక్క దళిత కుటుంబానికి దళిత బంధు ఇవ్వలేదని అన్నారు. వచ్చే ఎన్నికలలో తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రవళిరెడ్డి, పిన్నింటి రఘునాథ్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్ ప్రసాద్ తివారి, జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లూరి లక్ష్మణ్, మందమర్రి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాంధే రాంచెందర్, వెంచపెల్లి నాయకులు బొల్లావేని రాజా బాపు, మధుకర్ గౌడ్, పల్లె రాజు, ధూపం, శంకరయ్య సుఖేందర్, సతీష్, మరాఠీ, శంకర్, బాణయ్య పాల్గొన్నారు.

పోచమ్మ విగ్రహం ప్రతిష్టాపన

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో పోచమ్మ విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్టించారు. అనంతరం పూజారి నారాయణ మూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు వరుసల రహదారిలో భాగంగా పాత పోచమ్మ దేవాలయాన్ని తొలగించడంతో నూతనంగా హైదరాబాద్, నాగ్‌పూర్ అంతర్‌రాష్ట్ర రహదారి ప్రక్కన దేవాలయాన్ని నిర్మించారు. కార్యక్రమంలో అవినాష్, శివ, ప్రవీన్, జడ్పీటీసీ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడా విధి విధానాలపై సమీక్ష

నవతెలంగాణ-కోటపల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలంలో ఈ నెల 15 నుండి 17 వరకు క్రీడలు నిర్వహించాలని ఆదేశించిన నేపథ్యంలో శుక్రవారం చెన్నూర్ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో క్రీడలకు అవసరమైన సామాగ్రి, పోటీలు నిర్వహించే విధి విధానాలు, ఏర్పాటు చేసిన క్రీడా స్థలాలపై అధికారుల సమావేశంలో చర్చించారు. యువత క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మంత్రి బాపు, జడ్పీటీసీ మోతే తిరుపతి, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే, ఎంపీడీఓ టి.శ్రీనివాస్ ఎస్సై చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, పీఈటీ కారెంగుల రామయ్య పాల్గొన్నారు.

పట్టణంలో సమతా సైనిక్ దల్ ర్యాలీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో మార్చి ఫాస్ట్ నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని కైలాస్‌నగర్‌లో గల అశోక బుద్ధ విహార్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల గుండా కొనసాగింది. బ్యాండ్ మేళాల మధ్య ముందుకు సాగుతూ జై భీమ్ నినాదాలతో హోరెత్తించింది. అంబేద్కర్ చౌక్‌కు చేరుకొని విగ్రహానికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ దుర్గం శేఖర్, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబాసాహెబ్ కామ్లే, రమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు శోభ, అంబేద్కర్ వాదులు శైలేందర్ వాగ్మారే, వర్ష సమతా సైనిక్ దళ్ సభ్యులు పాల్గొన్నారు.



ఘనంగా వైశాఖ పౌర్ణమి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జిల్లా వ్యాప్తంగా వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగానే శుక్రవారం పట్టణంలోని మంగ మఠంలోని రమసత్యనారాయణ దేవాలయంలో పెద్ద ఎత్తున సామూహిక సత్యనారాయణ వ్రతం అలాగే సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వైభవ్ పంతులు ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బస్‌షెల్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కడెం



మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామ పంచాయతి మొర్రిగూడెం స్వర్గీయ రసురి లక్ష్మీనాగరాజ్ జ్ఞాపకార్థం వారి కుమారుడు ఏర్పాటు చేసినటువంటి బస్‌షెల్టర్‌ని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా శ్యామ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తుల కోసం బస్‌షెల్టర్ ఏర్పాటు చేసినటువంటి రసురి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ చిన్నయ్య, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శైలజ రమేష్‌రావు, బెల్లాల్ ఎంపీటీసీ లక్ష్మీజగన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్, సత్తెనపెల్లి, పాతఎల్లపూర్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళారులను నమ్మొద్దని, ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలని అన్నారు. ప్రభుత్వమే ప్రతి ధాన్యం గింజని కొంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ పీఏసీఎస్ చైర్మెన్ ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, సత్తెనపల్లి పీఏసీఎస్ చైర్మెన్ ఆమంద శ్రీనివాస్, సెక్రటరీలు తూప్రాన్ శ్రీనివాస్, భూమి ఆశన్న, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కాలనీలోని సమస్యలపై కలెక్టర్ సందర్శన



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని వార్డు నెం.20 ప్రియదర్శిని నగర్, సాగర్‌కాలనీల్లోని సమస్యలపై జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. ఎస్ఆర్ డీజీ స్కూల్ వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు, కందకం పరిశీలించారు. సీసీ రోడ్డు ఏర్పాటుకు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు పూర్తిచేసి త్వరగా పనులు ప్రారంభించాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ అధికారులతో చర్చించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, అర్బన్ తహసీల్దార్ సుభాష్ చందర్, స్థానిక కౌన్సిలర్ ముజాయిద్ చౌస్, కౌన్సిలర్‌లు, నాయకులు ఉన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

- వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ప్రారంభించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

క్రీడలతోనే మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి కాసేపు క్యారమ్, చదరంగం ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడాలు చాల ముఖ్యమని అన్నారు. 6ఎండ్ల నుంచి 16 ఏండ్ల చిన్నారులకు నిర్మల్ నియోజకవర్గంలో 110 గ్రామాల్లో వేసవి క్రీడా క్యాంపులను ఏర్పాటు చేసి వివిధ క్రీడాల్లో శిక్షణ ఇస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, కరాటే, వాలీబాల్, క్యారమ్, తదితర 44 రకాల క్రీడల్లో శిక్షణ ఈ నెల31 వరకు ఉంటుందని అన్నారు. ఈ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు శిక్షణ సమయంలో తగిన జాగ్రత్తలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం క్రీడల అభివృద్ధి కోసం అనేక చర్యలు తీసుకోవడంతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అన్ని విధాలుగా తోడ్పాటును



అందిస్తోందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక రమణ, అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆవరణలో అక్రమ కట్టడం



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

నియోజకవర్గ కేంద్రంలోని వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీ మాధవన్‌ను నిలదీశారు. ఆస్పత్రి ప్రహరీ గోడ ఎలా కూల్చివేస్తారని, మీకు ఎలాంటి అధికారం ఉందని ఆయన ప్రశ్నించారు. స్పందించిన డాక్టర్ వంశీ మాధవ్ వైద్య శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని నిర్మాణం సక్రమమైనదేనని అన్నారు. ఈ విషయంపై స్పందించిన మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. మున్సిపాలిటీ అధికారులు ఈ నిర్మాణానికి ఎలా అనుమతులు ఇస్తారని అన్నారు. ఆస్పత్రి ఆవరణను కాపాడాల్సిన బాధ్యత కలిగిన వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు నాయిని సంతోష్ ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రెండో విడత కంటి వెలుగును గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాథోడ్ గోవింద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపల్లి(జి) గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగును ప్రారంభించారు. 18 ఏండ్లపై బడిన వారు ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కంటి చూపు సమస్య ఉన్న వారికి వైద్యసిబ్బంది కండ్లాద్దాలు పంపిణీ చేస్తారని సూచించారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పైకు, వైద్యసిబ్బంది గ్రామ ప్రజలు ఉన్నారు.

పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని సాంగ్వి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం మన ఊరు మన కూరగాయలు కార్యక్రమంలో భాగంగా న్యూట్రిషన్ కిచెన్ గార్డెన్‌ను జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి ప్రారంభించారు. న్యూట్రిషన్ కిచెన్‌తో పోషక భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వంకాయ, మెంతి, కొత్తిమీరా, మునగ, టమాట తదితర మొక్కలు నాటారు. న్యూట్రిషన్ కిచెన్ గార్డెన్‌ను నాటడం ద్వారా ఇష్టమైన కూరగాయలు వేసుకోవచ్చని అన్నారు. ఇది పూర్తిగా సేంద్రియ, పోషకాలు అధికంగా ఉండే కూరగాయలు ఇంటి ఆవరణలో, ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేసుకుంటే పోషక భద్రతను కాపాడుకోవచ్చని సూచించారు. కిచెన్ గార్డెన్‌లో వివిధ రకాల కూరగాయలు, పూలు, పండ్ల మొక్కలను నాటడం ద్వారా చుట్టూ పరిసరాలు స్వచ్ఛంగా, ఆహ్లాదకరంగా, స్వచ్ఛమైన వాతావరణం తలపించేలా ఉంటుందని అన్నారు. ఈ కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడం వలన మంచి పోషకాలు అందుతాయని అన్నారు. అలాగే పెరుగుతున్న ధరలను నివారించేందుకు దోహదపడుతుందని తెలిపారు. మారుతున్న వాతావరణం, జీవనశైలిలో కిచెన్ గార్డెన్ అనేది మానవ జీవితంలో ఒక మంచి మార్పుఅని, ప్రాముఖ్యతను సంతరించుకుంటుందని తెలియజేశారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు ఎంతో ఉపయోగకరమని, రక్తహీనత వల్ల మాతృ మరణాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. అనంతరం నర్సరీ, తెలంగాణ క్రీడాప్రాంగాణాలను పరిశీలించి, అంగన్‌వాడీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరంలో చిన్నారుల ఆట పాటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సుధీర్ బాబు, ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, ఎంపీఓ అజీజ్ ఖాన్, సర్పంచ్ అచ్యుత్ రావు, ఎంపీటీసీ పోల జయసుధ సురేష్, కోఆప్షన్ సభ్యులు డాక్టర్ యు.సుభాష్ రావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన వైఖరి తెలియజేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ అధినేత్రి మాయావతి స్పష్టమైన వైఖరి తెలియజేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు కాంబ్లే బాలాజీ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 7న హైదరాబాద్ రాబోతున్న బీఎస్పీ అధినేత్రి మాయావతి ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన వైఖరి తెలియజేయాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తున్నామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ తీర్మానాలు చేసారని, ఇటీవల కర్నాటక ప్రభుత్వం క్యాబినెట్ తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందని అన్నారు. దేశంలో బహుజన నాయకురాలిగా చెప్పుకుంటునటువంటి మాయావతి ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన వైఖరి తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఉన్నారు.

సంఘ భవనానికి భూమిపూజ

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని ఎల్లాపూర్‌లో శుక్రవారం మున్నూరు కాపు సంఘ భవనానికి, స్థానికి ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రేఖా నాయక్ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్నూరు కాపు సంఘ సభ్యులు మండలం ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

నవతెలంగాణ-కడెం

వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మూడు గంటల పాటు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత 15 రోజుల నుంచి ఐకేపీ వీఓఏలు నిరవధిక సమ్మె చేస్తున్నారని అన్నారు. వీఓఏల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే నిర్మల్ జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చామని అన్నారు. 19 సంవత్సరాల నుండి గ్రామాలలో మహిళలకు అభ్యున్నతి మహిళా స్వయం సహకార సంఘాలు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. మహిళలకు ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి వారికి అవగాహన కల్పిస్తూ చిన్న వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహించి, వారికి లోన్స్ ఇప్పించి సక్రమంగా లోన్స్ తిరిగి చెల్లించే విధంగా ప్రోత్సహిస్తున్నారని అన్నారు. డ్వాక్రా మహిళా సంఘాలు నిర్వహిస్తున్న లావాదేవీలన్నీ పుస్తక నిర్వహణ చేస్తూ లైవ్ మీటింగ్స్ పెట్టి అన్ని



సంఘాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నారని అన్నారు. మహిళా సంఘాల పనులే కాకుండా ప్రభుత్వం నుంచి చేపడుతున్న అన్ని రకాల సంక్షేమ పథకాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి 9 సంవత్సరాలు దాటిన ఐకేపీ వీఓఏల బతుకులకు మారలేదు వీఓఏలకు సెర్ప్ నుంచి రూ.3వేల900 వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని అన్నారు. వీఓఏలకు కొత్త కొత్త సర్వేలు చేపిస్తూ పని భారం మోపుతున్నారని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధ మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలకు మధ్యాహ్న భోజన యూనియన్ సంపూర్ణ మద్దతునిస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామస్థాయి వీఓఏలకు అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని చాలాసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చాం కానీ పనికి తగ్గ గుర్తింపు గాని వేతనం ఇవ్వడం లేదని, రోజురోజుకు పని భారం పెంచుతూ ఉద్యోగ భద్రత కల్పించకుండా ఐకేపీ వీఓఏలను ప్రభుత్వం విస్మరిస్తోందని అన్నారు.

జంగ్ సైరన్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

నిరుద్యోగ యువత కోసం ఈనెల 8న రాజధానిలోని సరూర్‌నగర్ మైదానంలో ఏర్పాటు చేసిన నిరుద్యోగ జంగ్‌సైరన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జంగు సైరన్ కార్యక్రమానికి జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ వస్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు. నియోజవర్గం నుండి పార్టీ బాధ్యులు, కార్యకర్తలతో పాటు నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దయానంద్, ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాష పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం, జంగిల్ శంకర్, సలీంలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణకు రూ21వేలు విరాళం



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని బోప్పాపూర్ గ్రామంలో నిర్మించే భారత రాజ్యాంగా నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణకు శుక్రవారం దివ్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.21 వేలు విరాళంగా అందజేశారు. సేవా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న దివ్యశ్రీ పౌండేషన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ గ్రామ బుద్ధ విహార్ అంబేద్కర్ కమిటీ సభ్యులకు అందజేశారు. దీనికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

గండ్రత్ సుజాత ఇంటి ఎదుట బీజేపీ నాయకులు బైఠాయింపు

- బీజేపీ నాయకులు అరెస్ట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కర్ణాటక అసెంబ్లీ ఎలక్షన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేనిఫెస్టోలో బజరంగ్‌దళ్ సంస్థను బ్యాన్ చేస్తామని, చేర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని రెడ్డి తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ వైఖరిని ఖండిస్తూ జిల్లా కేంద్రంలోని ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత నివాసం ఎదుట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పఠనం చేశారు. కాసేపు అక్కడే శాంతియుతంగా నిరసన తెలిపి నినాదాలు చేస్తూ హోరెత్తించారు. అనంతరం సుజాత ఇంట్లోకి చొచ్చుకొని వెళ్లడానికి యత్నించిన నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాసేపు స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం సుహాసినిరెడ్డితో పాటు నాయకులను పోలీసులు తమ వాహనంలో ఎక్కించి స్టేషన్‌కు తరలించి అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందు మనోభావాలను దెబ్బ తీసేలా, రాజకీయ లబ్ది కొరకు వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఓట్ల కోసమే ఇలా హిందువులను కించపరిచే మాట్లాడటం సరికాదన్నారు.

పోటాపోటీగా నినాదాలు..

అటు గండ్రత్ సుజాత నివాసం లోపల ఉన్న నాయకులు కాంగ్రెస్ పార్టీ బచావో అంటూ నినాదాలు చేయగా, ఇటు బీజేపీ నాయకులు కాంగ్రెస్ కు హఠావో బీజేపీకి బచావో అంటూ పోటాపోటీగా నినాదాలు చేశారు. పోలీసులు ముందస్తుగా అప్రమత్తంగా ఉండి బీజేపీ నాయకులను అరెస్ట్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయాలి

నవతెలంగాణ-బేల

మండలంలోని టాక్లీ గ్రామంలో కరెంటు ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులతో కలిసి యూత్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండల ఏఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన ఏఈ సంతోష్ వెంటనే కార్యాలయానికి వచ్చి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులతో కలిసి టాక్లీ గ్రామానికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సామ రూపేష్ రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి టాక్లీ గ్రామంలో సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌పైన లోడ్ పడటంతో రాత్రి వేళల్లో కరెంటు లేక గ్రామస్తులు అంధకారంలో ఉంటూ చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రస్తుతం ఈదురు, గాలులు వర్షాలు కురుస్తుండటంతో విష, పురుగులు తిరిగే అవకాశం ఉందన్నారు. దీనివల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ప్రజల ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో ఉన్నటువంటి సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మత్తులు చేయించి గ్రామంలో కరెంటు ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఏఈ సంతోష్‌ను కోరడం జరిగిందన్నారు. అయితే సానుకూలంగా స్పందించిన ఏఈ వెంటనే మరమ్మత్తులు చేయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాము, బన్కర్ రాకేష్, నరేందర్, ప్రవీణ్ సురేందర్, అమిత్, నిలేష్ సుమిత్, దిలీప్, అతుల్, ఓం, అవినాష్ ఉన్నారు.

బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి



నవతెలంగాణ-కడెం

మండలంలోని చిన్న, పెద్ద బెల్లాల్ గ్రామాల్లో బీఆర్ఎస్ యువ నాయకులు బాధవత్ పూర్ణ చందర్ నాయక్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. బెల్లాల్ పెర్కపల్లి గ్రామంలోని సబ్బండ వర్గాల ప్రజలను కలుసుకుని వారితో ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చెందుతోందని అన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని దర్శించుకొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, స్థానిక యూత్ నాయకులు పూర్ణచందర్ నాయక్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో రెండు ఆవులు మృత్యువాత



నవతెలంగాణ-ఉట్నూర్

మేతను మేసేందుకు వెళ్లిన రెండు ఆవులు విద్యుద్ఘాతానికి గురై మృత్యువాత పడ్డ ఘటన శుక్రవారం పులిమడుగు గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... పులిమడుగు గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన రైతులు యశ్వంత్ రావు, నూర్‌సింగ్‌లకు చెందిన ఆవులు రెండు శుక్రవారం మేత మేసేందుకు సమీప చేనులోకి వెళ్లాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో విద్యుత్ వైర్లు కింద పడ్డాయి. అటుగా వెళ్లిన ఆవులు ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కేడే మృత్యువాత పడ్డాయి. ఆవులు మృతి చెందడంతో రూ.60వేల వరకు నష్టపోయామని బాధితులు పేర్కొన్నారు. విద్యుత్ వైర్లతో ఇటీవల గిరిజన రైతు చెరుకు పంట దగ్ధమైందని అన్నారు. గతంలో ఇద్దరు వ్యక్తులు కూడా విద్యుత్ వైర్లతో మృతి చెందిన సంఘటనలు ఉన్నాయని విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ వైర్లు సరి చేసి ఉంటే ఆవులు ప్రాణాలతో ఉండేవని తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చూసుకునే బాధ్యత ఉందని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

గ్రామపంచాయతీ భవనానికి భూమిపూజ



నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని బావపూర్(ఆర్) గ్రామంలో శుక్రవారం నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే రేఖా నాయక్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం హయాంలో అన్ని గ్రామపంచాయతీలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని అన్నారు. కొత్త భవనాల ఏర్పాటుతో గ్రామాలకు కొత్త కల వచ్చిందని అన్నారు. గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు

నవతెలంగాణ-నార్నూర్



దుప్పాపూర్ గ్రామంలో దమ్మరత్ బుద్ధ విహార్‌లో శుక్రవారం బుద్ధ పౌర్ణమి సందర్భంగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దమ్మరత్ బుద్ధ విహార్ కమిటీ సభ్యులు బుద్దుని ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో ఖైర్‌డాట్వా గ్రామపంచాయతీ సర్పంచ్ కనక సేవంత ప్రభాకర్, దూతరాజ్ మధుకర్, రమేష్, జ్ఞానోబా, విశ్వజిత్ ధూత్రాజ్, సంఘమిత్ర మహిళా సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 06 మే 2023

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన
నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా శుక్రవారం స్థానిక స్టేట్ బ్యాంక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంక్ సిబ్బంది బ్యాంక్ కార్యకలాపాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కామర్స్ అధ్యాపకులు రాజు మాట్లాడుతూ బ్యాంకులో జరిగే లావాదేవీలను ప్రత్యక్షంగా గమనించడం ద్వారా విద్యార్థులకు విషయ పరిజ్ఞానం పెరుగుతుందని అన్నారు. బ్యాంక్ మేనేజర్ అశోక్‌కుమార్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి వీరస్వామి, అధ్యాపకులు ప్రేంకుమార్, శరత్, చంద్ర, సుష్మిత, కవిత, జనార్దన్ పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్ ప్రవేశానికి లక్కీడ్రా ద్వారా విద్యార్థి ఎంపిక
నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (బేగంపేట)లో ఉచిత విద్యాభ్యాసానికి 1వ తరగతి ప్రవేశానికి గాను జిల్లా నుండి 1 విద్యార్థిని లక్కీ డ్రా పద్దతిన ఎంపిక చేశారని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకున్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల ఎంపిక కార్యక్రమంలో పాల్గొని లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరానికి గాను జిల్లాకు కేటాయించిన 1 సీటుకు లక్కీ డ్రా నిర్వహించడం జరిగిందని, ఇందులో తిర్యాణి మండలం గంభీరావుపేట గ్రామానికి చెందిన దాగామ సాత్విక్ ఎంపికయ్యాడని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని శ్రద్ధగా చదువుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, టిఎస్‌ఎస్డబ్ల్యుఆర్‌ఎస్ జిల్లా సమన్వయకర్త బాలరాజు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివద్ధి అధికారి సజీవన్ పాల్గొన్నారు.

ఆశ్రమ వార్షికోత్సవంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో నందగిరి నారాయణస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నరనారాయణ ఆశ్రమం 18వ వార్షికోత్సవ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మనిషి ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని, అప్పుడే సమాజంలో శాంతి సహనం సౌభ్రాతృత్వం పెంపొందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, మోతుగూడ సర్పంచ్ వినోద్, బూరుగుడ ఉప సర్పంచ్ బుజాడి కుమార్, మాజీ ఎంపీటీసీ రవీందర్, తేలి సంఘం జిల్లా అధ్యక్షుడు సందీప్ పాల్గొన్నారు.

15న అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ



నవతెలంగాణ-సిర్పూర్(టి)

భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్టు అంబేద్కర్ సంఘం తాలుకా ఉపాధ్యక్షుడు గొర్లపల్లి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అంబేద్కర్ వారసులు హాజరుకావాలని ఆయన కోరారు. శుక్రవారం మండలకేంద్రంలోని బుద్ధవిహార్‌లో విగ్రహావిష్కరణ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా భారతదేశ దశదిశను నిర్ణయించిన అంబేద్కర్ బహుజనులను, ఆయన కలలు కన్న సమసమాజ నిర్మాణం కోసం పాటుపడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నేటి పరిపాలన ఆయన సూచించిన మార్గంలోనే కొనసాగుతుందని, ప్రపంచ మేధావిగా పేరుగాంచిన మహనీయుడి విగ్రహావిష్కరణ దహెగాం మండలంలోని హత్తిని గ్రామంలో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల బౌద్ధ సంఘం అధ్యక్షుడు నగరాడె రాజు, బౌద్ధ సమాన సంఘం నాయకులు తిరుపతి, ప్రభాకర్, సంజయ్, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

వినియోగదారుల సంస్థలు రిజిస్టర్ చేయించుకోవాలి
నవతెలంగాణ-ఆసిఫాబాద్

వినియోగదారుల రక్షణ కోసం జిల్లాలోని వినియోగదారుల సంస్థలు తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకుని తమ వివరాలను ఈనెల 8వ తేదీ లోపు జిల్లా కార్యాలయంలో సమర్పించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిని తారామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఏమైనా అనుమానాలు సలహాలు సూచనలు కావలసినవారు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ సెల్ నెంబర్ 9347752492 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కొత్త శ్రేణి డియోడరెంట్స్‌ను లాంచ్ చేసిన ఐటీసీ ఎంగేజ్
నవతెలంగాణ- ఆదిలాబాద్

ఇష్టపడి కష్టపడితేనే అనుకున్నది సాధించగలమనే వారికోసం ఐటీసీ ఎంగేజ్ ఇలాంటి వారి ద్వారా ప్రేరణ పొందు తుంది. అందుకే ఐటీసీ ఎంగేజ్ ఇంటెన్స్ పేరుతో కొత్త శ్రేణి డియోడరెంట్స్‌ను లాంచ్ చేసింది. దీనికి బ్రాండ్ అంబాసిడర్ గా ప్రముఖ క్రికెటర్ శుభ్ మన్ గిల్ ఉన్నారు. బ్రాండ్ అంబాసిడర్‌గా శుభ్ మన్ గిల్ ఎంగేజ్ ఇంటెన్స్ కోసం తన తీవ్రమైన ప్రిపరేషన్, గేమ్ను తెరపైకి తెచ్చాడు. ఈ సందర్భంగా ఐటీసీ లిమిటెడ్ పర్సనల్ కేర్ బిజినెస్ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్ సత్పతి మాట్లాడుతూ.. విజయం అనేది సాధన పట్ల మారుతున్న వైఖరులను చూసేందుకు నిజంగా ప్రేరణనిస్తుందన్నారు. చాలా మంది యువకులు రిస్క్ లు తీసుకోవడానికి, అభిరుచి మేరకు తమ కలలను సాధించేందుకు ఇష్టపడతారన్నారు. ఇందుకు అపారమైన కృషి చాలా అవసర మన్నారు. ఇది ఎంగేజ్ ఇంటెన్స్ జరుపుకునే ప్రదర్శన కోసం ఉత్సాహంతో కూడిన ప్రయాణ మన్నారు. ఎంగేజ్ ఇంటెన్స్ బ్రాండ్ అంబాసిడర్ శుభమాన్ గిల్ మాట్లాడుతూ... కష్ట పడితే వచ్చిన విజయం పట్ల తనకు చాలా గౌరవం ఉందన్నారు. కృషి, ప్రతిభకు ఒకదానితో ఒకటి సంబంధం లేనప్పటికీ, కృషి అనేది దేనినైనా ఇస్తుందని తాను నమ్ముతున్నానన్నారు. పనితీరు కీలకం, ఏ గేమ్ ను తీసుకురావడానికి పనితీరు, అభ్యాసం, సహనం, ప్రేరణ చాలా అవసరమన్నారు. ఎంగేజ్తో భాగస్వామి అయిన ందుకు తాను సంతోషంగా ఉన్నానన్నారు.

మహర్ సంఘం లోగో ఆవిష్కరణ
నవతెలంగాణ-కాగజ్‌నగర్



తెలంగాణ మహర్ సంఘం లోగోను శుక్రవారం బుద్ధసంఘం నాయకులు ఆవిష్కరించారు. మండలంలోని చింతగూడ గ్రామంలో అంబేద్కర్ భవనం వద్ద లోగోను ఆవిష్కరించిన అనంతరం నాయకులు జాడి దీపక్ మాట్లాడుతూ మహర్‌ల అభివృద్ధికి ఈ సంఘం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చరిత్రలో మహర్‌లను మహావీరులుగా పిలుస్తారని, శతాబ్దాల క్రితం మహర్‌లు రాజులుగా, సైన్యాధిపతులుగా, యుద్ధవీరులుగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వాలు మహర్‌లకు గుర్తింపు ఇవ్వడం లేదని అన్నారు. ఎంపీటీసీ దుర్గం మోతీరాం మాట్లాడుతూ సిర్పూరు నియోజకవర్గంలో కొంతమంది నాయకులు వారి స్వార్థం కోసం కమిటీలు వేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మహర్ సంఘం నాయకులు గొర్లపల్లి శంకర్, గుర్కె బావూజీ, డొంగ్రి కార్తీక్, జాడి శివరాం, గోవర్ధన్, గణేష్, సందీప్, ప్రశాంత్, చరణ్ పాల్గొన్నారు.

8వ రోజుకు చేరిన జేపీఎస్‌ల సమ్మె
నవతెలంగాణ-కోటపల్లి



జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చెన్నూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన నిలవధిక సమ్మె శుక్రవారం 8వ రోజుకు చేరుకుంది. యేపీఎస్‌లకు వైఎస్ఆర్ టీపీ చెన్నూర్ ఇన్‌చార్జి దుర్గం నగేష్ మద్దతు తెలిపారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జన్నారం : జూనియర్ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం 8వ రోజుకు చేరింది. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాల ఆవరణలో జేపీఎస్‌లు సమ్మె కొనసాగించారు. తమకు ఇచ్చిన నాలుగు సంవత్సరాల ప్రొహిబిషనరీ కాలం ముగిసినా ప్రభుత్వం తమను పర్మినెంట్ చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగులకు వర్తించే అన్ని బెనిఫిట్స్ ను అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు లావణ్య, సరిత, శ్రీనాథ్, శ్రీకాంత్, ప్రసాద్, రమేష్, సాగర్, మధు, వినోద్ కుమార్ భీంరావు పాల్గొన్నారు.



హాజీపూర్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వు జారీ చేయాలని తెలంగాణ సింగరేణి కార్మిక బిడ్డల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోల్ల సరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కీలకపాత్ర పోషిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని అదేవిధంగా అవుట్సోర్సింగ్ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలన్నారు. జీతభత్యాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వారి పని విధానం వల్ల నేడు రాష్ట్రానికి అనేక అవార్డు వచ్చాయని వారి సేవలను దష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి జీతాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దూట లింగస్వామి పాల్గొన్నారు.

పంచాయితీ సిబ్బంది నిరవధిక సమ్మె
నవతెలంగాణ-కాసిపేట



ప్రభుత్వం తమకు ప్రత్యేక హోదా కల్పించి వేతనాలు పెంచాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో శుక్రవారం మండల పంచాయితీ కారొబార్లు, సిబ్బంది నిరవధిక సమ్మెను చేపట్టారు. ఈ సందర్భంగా మండల గ్రామ పంచాయితీ కారొబార్లు, సిబ్బంది సంఘం నాయకుడు దాసరి రాజయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పంచాయితీ కారొబార్లు, సిబ్బంది సంఘం తమ డిమాండ్ల సాధన కోసం వినతిపత్రం రూపంలో పలు మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోకపోవడంతోనే రాష్ట్ర సంఘం పిలుపు మేరకు నిరవధిక సమ్మెను చేపట్టినట్లు తెలిపారు. పంచాయితీలలో పని చేస్తున్న కారొబార్లు, బిల్ కలెక్టర్‌లకు సహాయ పంచాయితీ కార్యదర్శి హోదా కల్పించి, కనీస వేతనం రు.21,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తరువులు నెం. 51 ప్రకారం సపాయి, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషన్, ట్రాక్టర్ డ్రైవర్‌లకు కేటాగిరిల వారిగా హోదా కల్పించి కనీస వేతనం రూ.15,500లు ఇవ్వాలని కోరారు. గ్రామ పంచాయితీ నిధుల నుంచి కాకుండా వేతనాలను నేరుగా ప్రభుత్వమే సిబ్బంది ఖాతాలో జమ చేయాలని అన్నారు. పంచాయితీ సిబ్బంది చేస్తున్న నిరవధిక సమ్మెకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్దనపల్లి సర్పంచ్ వేముల కృష్ణ, నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయితీ కారొబార్లు, సిబ్బంది సంఘం నాయకులు సిలోజు మురళి, వెంకటేష్, దీపక్ పాల్గొన్నారు.

మోకాళ్లపై ఐకేపీ వీఓఏల రాస్తారోకో



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీఓఏలు చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. అయినా ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడంతో శుక్రవారం వీఓఏలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు మోకాళ్లపై నిల్చొని రాస్తారోకో చేపట్టారు. ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. సీఐటీయూ నాయకుడు ముంజం ఆనంద్‌తో పాటు వీఓఏలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ముంజం ఆనంద్ మాట్లాడుతూ గత 19 రోజులుగా వీఓఏలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించకపోగా, సమ్మె చేస్తున్న వారిని అరెస్ట్ చేయడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు లత, వనిత, గీత, అంకన్న కళ్యాణి, శ్రీనివాస్, పెంటన్న, గణేష్, ధన్‌రాజ్, రాంచందర్, రజిత, రాజ్యలక్ష్మి, సౌందర్య, మమత, అంజలి, చిన్నన్న, మోహన్, భీంరావు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

బీసీ సంఘ భవనం, బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి
నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘ భవనాన్ని ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సౌకర్యార్థం బీసీ స్టడీ సర్కిల్ ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్, అదనపు కలెక్టర్ రాజేశం లకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీసీలు ఎక్కువగా ఉన్నారని ఆయనప్పటికీ సంఘ భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గతంలో నాయకులు అనేక సందర్భంలో హామీ ఇచ్చారని జిల్లా కేంద్రంలో వెంటనే సంఘ భవనం నిర్మించాలని కోరారు. అలాగే బీసీలలో అనేకమంది పేద విద్యార్థులు చదవాలని ఉన్నప్పటికీ పేదరికంతో చదవలేక పోతున్నారని అన్నారు. పోటీ పరీక్షల్లో నెగ్గాలంటే తప్పనిసరిగా శిక్షణ అవసరమని, దానికి కావలసిన డబ్బులు లేకపోవడంతో విద్యార్థులు పోటీ పరీక్షల్లో నెగ్గలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని బీసీ విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి మిట్ట తిరుపతి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మారుతి పటేల్, నాయకులు నారాయణ, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఏరియర్స్ చెల్లించాలి



నవతెలంగాణ-రెబ్బెన

- హెచ్ఎంఎస్ అధ్యక్షుడు ఎండి గౌస్

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం జనరల్ మేనేజర్ జి.దేవేందర్ హెచ్ఎంఎస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సత్యం రాజాబాబు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గోలేటి సీహెచ్‌పీలో హైజింగ్ కీపింగ్ కార్మికుల పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్‌ను వెంటనే ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుమురంభీం జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు ప్రతినెల 10వ తేదీలోపు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఒడిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నానాయక్ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసినట్టుగా తెలంగాణ ప్రభుత్వం వెంటనే సింగరేణిలో ఉన్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. అప్పుడే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న దానికి కార్మికులకు న్యాయం జరిగినట్టు అవుతుందన్నారు. సింగరేణిలో టీబీజీకేఎస్ నాయకత్వం అసెంబ్లీ సాక్షిగా కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని, కానీ గెలిచిన టీబీజీకేఎస్ చేతకాని తనంతో కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయకపోవడం వల్ల శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ముఖ్యమంత్రి కాంట్రాక్టు కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. లేనిపక్షంలో గాంధీ మార్గంలో కార్మికుల పక్షాన మలిదశ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గోలేటి సీహెచ్‌పీ ఫిట్ సెక్రటరీ బాలేష్, రాజేష్, ఆర్గనైజర్ శంకరమ్మ, పార్వతి పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలలో గిరిజన సంఘం నాయకులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

భద్రాచలంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలలో కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి నేర్పెల్లి అశోక్, జిల్లా అధ్యక్షులు కొరెంగ మాలాశ్రీ, ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, నైతం రాజు, జిల్లా కమిటీ సభ్యులు డి బక్కన్న, లక్ష్మి, సిడాం శంకర్, సుంకె లక్ష్మి, బండి మల్లేష్ పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీ టీం లక్ష్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలు, బాలికల రక్షణ కోసమే షీ టీం పనిచేస్తుందని షీ టీం నిర్వాహకులు వివరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాజంపేటలో షీ టీంపై సుజన్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా ఈవ్టీజింగ్ చేసిన, సామాజిక మాధ్యమాల్లో వేధింపులకు గురిచేసిన వెంటనే 100 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. షీ టీం 24 గంటలు అందుబాటులో ఉంటుందని ఏదైనా అవసరం పడితే 8712670564 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సైబర్ క్రైమ్‌కు గురి అయితే 1930 కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ షి టీం ఇన్‌చార్జి సునీత, షీ టీం సభ్యులు స్వప్న, శ్రీలత పాల్గొన్నారు.

మినహాయింపుల తర్వాతే ఆదాయపు పన్ను విధించాలి
నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉద్యోగ విరమణ పొందిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్‌పై విధిస్తున్న ఆదాయపు పన్నులో ఉన్న లొసుగులను నివారించాలని కోరుతూ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎస్‌టీఓ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. రిటైర్డ్ ఉద్యోగుల సేవింగ్స్ అనంతరం ఉండే ఆదాయంపైనే అధికారులు పన్ను విధించాలని, అది కూడా 11 నెలల ఆదాయంపైనే పన్ను విధించాల్సి ఉండగా అలా జరగడం లేదని పేర్కొన్నారు. గతేడాది చెల్లించిన ఆదాయపు పన్ను ఎంత ఉంటుందో, అంత మాత్రమే పెన్షన్ నుండి కోత విధించాలని వారు కోరారు. ఎస్‌టీఓకు వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం అధ్యక్షులు జయదేవ్ అబ్రహం, కార్యదర్శి శివప్రసాద్, సభ్యులు ఎఎస్ఆర్ మూర్తి, బి నర్సయ్య, షేక్ మహబూబ్, మక్బుల్ హుస్సేన్, అల్లి రాజయ్య ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ
నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్ గ్రామంలోని ఇద్దరు లబ్ధిదారులకు రూ.85 వేల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదన్నారు. ఆర్థిక స్తోమత లేక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిందం చంద్రయ్య, నాయకులు జాడి రాజన్న, వెంకట్, జాడి బానయ్య కామెర శంకర్, గుగులావతి రవి, కామెర దుర్గయ్య పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం
నవతెలంగాణ-రెబ్బెన

గోలేటిలోని శ్రీ భీమన్న క్రీడా మైదానంలో శుక్రవారం వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు ఉచిత క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిత్యం సాధన ద్వారా క్రీడా నైపుణ్యం పెరుగుతుందన్నారు. క్రమశిక్షణతో పాటు వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్‌లో రాణించి జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. మైదానంలో సౌకర్యాలకు లోటులేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఐ.లక్ష్మణ్‌రావు, సీనియర్ పర్సనల్ అధికారి జీకె కిరణ్‌కుమార్, టీబీజీకేఎస్ నాయకులు మాంతు సమ్మయ్య, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ చంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత



నవతెలంగాణ-బెజ్జూర్

మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం కళాకారులు కళా జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ తిరుపతి మాట్లాడుతూ సహకార బ్యాంకులో తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లించాలని తిరిగి రైతులు రుణాలు పొందాలని కోరారు. ప్రభుత్వం ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సహకార సిరి ప్రత్యేక డిపాజిట్ పథకాలు, గోల్డ్ లోన్, ఏటీఎం సౌకర్యం ఉన్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది వెంకటేశ్వర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, ఎడ్ల మహేష్, దేవాజీ, శ్రీనివాస్, కళాకారులు రమేష్, జై చందర్ పాల్గొన్నారు.

ఉచిత అంబలి పంపిణీ అభినందనీయం : డీఆర్డీఓ

నవతెలంగాణ-కడెం



తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నచ్చన్‌ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న చేస్తున్న సేవలు అభినందనీయమని డీఆర్డీఓ విజయలక్ష్మీ అన్నారు. శుక్రవారం నచ్చన్ ఎల్లాపూర్‌లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం సర్పంచ్ బొడ్డు గంగన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అంబలి కేంద్రాన్ని సందర్శించి ఉపాధి కూలీలకీ, బాటసారులకు అంబలి పంపిణీ చేస్తున్నందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ జయదేవ్, టీఏలు కాంతారావు, గణేష్, ఎఫ్ఏ కమలాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఐకేపీ వీఓఏల వినతి

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని ఐకేపీ వీఓఏలు శుక్రవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. వీఓఏలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. తమను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. ఉద్యోగ భద్రత సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. రూ.10 లక్షల సాధారణ భీమా, ఆరోగ్యబీమా కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వీఓఏలకు పదోన్నతులు కల్పించాలని కోరారు. వీఓఏల వేతనాలను నేరుగా ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వారి డిమాండ్ల సాదనకు కృషి చేస్తానని, సమస్యని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వీఓఏలు పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కడెం

మండలంలోని లక్ష్మి సాగర్‌లో పీఏసీఎస్, చిన్న బెల్లాల్‌లోని డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ధాన్యం గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శైలజ రమేష్‌రావు, వైస్ ఎంపీపీ కట్ట శ్యామ్ సుందర్, ఆత్మ కమిటీ చైర్మెన్ కానూరు సతీష్, లింగాపూర్ సర్పంచ్ ఆకుల బాలవ్వ లచ్చన్న, లింగాపూర్ ఉపసర్పంచ్ రంజిత్, లక్ష్మీ సాగర్ సర్పంచ్ మూడికే మల్లేష్ యాదవ్, కడెం మండల సోషల్ మీడియా ఇన్‌చార్జీ ఎండీ హసీబ్, మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండలకేంద్రంలో శుక్రవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న గిట్టుబాటు ధరకు రైతులు తమ ధాన్యన్ని అమ్ముకొని ఆర్థికంగా నీలదొక్కుకొవాలని ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముత్యంరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శాతం గంగారాం, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ సంగం వెంకటరాజు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ఈటెల శ్రీనివాస్, కల్లెడ భూమన్న, బిట్లింగ్ నారాయణ, సురేష్‌రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీల వర్గీకరణపై మాయావతి స్పష్టమైన వైఖరి తెలియజేయాలి

నవతెలంగాణ-నిర్మల్

ఎస్సీల వర్గీకరణ పట్ల బీఎస్పీ అధినేత్రి మాయావతి స్పష్టమైన వైఖరి తెలియజేయాలని ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్పీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శనిగారపు రవి మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 7న హైదరాబాద్‌లో జరుగనున్న బీఎస్పీ సభకు మాయావతి రానున్న సందర్భంలో అదే సభలో మాదిగల పట్ల మాదిగ ఉపకులాల పట్ల తమ పార్టీ తరుపున స్పష్టత ఇవ్వాలిని అన్నారు. దేశంలో అగ్ర పార్టీలుగా ఉన్న బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ పార్టీలు ఎస్సీల వర్గీకరణ న్యాయమైందని తమ వైఖరిని తెలియజేశారని గుర్తు చేశారు. అదేవిధంగా బీఎస్పీ పార్టీ మాదిగల పట్ల, మాదిగ ఉప కులాల పట్ల వర్గీకరణ పట్ల స్పష్టత ఇవ్వాల్సి ఉందని అన్నారు. సమావేశంలో మండల అధ్యక్షులు సాయినాథ్, నాయకులు శంకర్, రాజు, శివకుమార్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : బహుజన సమాజ్ పార్టీ అదినేత్రి మాయవతి ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన వైఖరి వెల్లడించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7న తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ భరోసా సభకు బీఎస్పీ అధినేత్రి మాయావతి వస్తున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణపై తమ పార్టీ తరపున స్పష్టత నివ్వాలని పేర్కొన్నారు. 29 ఏండ్లుగా తెలుగు నేల మీద సామాజిక న్యాయ సూత్రమైన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మాదిగ ఉపకులాలు పోరాటం చేస్తున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో అంబేద్కర్ కాన్షిరాం పునాదుల మీద ప్రయాణిస్తున్నామని చెబుతున్న బీఎస్పీ, ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన వైఖరి వెల్లడించాలని అన్నారు. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టే విధంగా బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్నారు.

విద్యుత్ భద్రత పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

విద్యుత్ భద్రత, పొదుపు సూచనల పోస్టర్లను పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సిబ్బందితో కలిసి ఏడీఈ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ భద్రత మనందరి బాధ్యతగా గుర్తించాలని అన్నారు. రైతులు డీఎస్ఎం పద్ధతులను పాటించి, నాణ్యమైన విద్యుత్ సరఫరా పొందాలని అన్నారు. అలాగే గృహ ఉపకరణాలయినటువంటి ఎలక్ట్రిక్ వాటర్ హీటర్, గ్రీజర్లకు బదులు సోలార్ పరికరాలను వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ తిరుపతి, సబ్ ఇంజనీర్ వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వాటిని సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని కవ్వాల్ టైగర్ జోన్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని పలు నర్సరీలను పరిశీలించారు. అంతకుముందు మండలంలోని బీర్సాయిపేట్ రేంజ్ పరిదిలోని నర్సరీ పరిశీలించి, మొక్కల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రకాలు మొక్కలు ఉన్నాయని, నర్సరీ లక్ష్యం తదితర వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల విస్తీర్ణాన్ని పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహరం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఇందులో భాగంగా మొక్కలను నాటేందుకు నర్సరీలను సైతం ఏర్పాటు చేశామని అన్నారు. మొక్కలు నాటే వరకు నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరు పోయాలని సూచించారు. అంతకుముందు స్థానిక ఉట్నూర్ రేంజ్ కార్యాలయంలో ఉట్నూర్ సబ్ డివిజన్ కవ్వాల్ టైగర్ జోన్ అధికారులతో పాటుగా ఆటవీ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా బీట్ పరిధులలోని చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, అక్రమ కలప తరలింపు కాకుండా, ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వాటిపై సమీక్ష నిర్వహించి, అడవుల సంరక్షణపై పలు సూచనలు అందించారు. ఆయన వెంటన డీఎఫ్ఓ రాజశేఖర్, ఎఫ్డీఓ కోటేశ్వరరావు, ఆయా రేంజ్ల ఎఫ్ఆర్వోలు, ఎఫ్ఎస్ఓలు, బీట్ అధికారులు ఉన్నారు.

ఎస్టీ హోదా సాధించేవరకు పోరాటం

నవతెలంగాణ-తలమడుగు

గత 22 సంవత్సరాలుగా ఎస్టీ హోదా కోసం పోరాడుతున్న మాలీ కులస్తులు పూర్తిస్థాయిలో ఎస్టీ హోదా లభించే వరకు విశ్రమించకూడదని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. శుక్రవారం భరంపూర్ గ్రామ మాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అంతకుముందు బస్టాండ్ ప్రాంగణంలో పులే దంపతుల చిత్రపటాలను ఆవిష్కరించారు. భరంపూర్ గ్రామ మహాజన్ గురునులే వినోద్, మాలీసంఘం జెండాను ఆవిష్కరించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ మహాత్మ జ్యోతిరావు పులే దంపతుల స్ఫూర్తితో మాలీ సంఘం పోరాటాలు సాగిస్తున్నామని తెలిపారు. ఒక దిక్కు పూలే ఆశయ సాధన కోసం పరితపిస్తూనే రెండో దిక్కు ఎస్టీ హోదా కోసం పోరాటాలు చేస్తున్నామని అన్నారు. మాలీల పోరాటాల ఫలితంగానే సీఎం కేసీఆర్ మాలీలకు ఇచ్చిన మాట ప్రకారం ఎస్టీ హోదా కల్పిస్తున్నట్లు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి ఆమోదం కోసం పంపారని అన్నారు. కేంద్రం ఇకనైనా ఆలస్యం చేయకుండా వెంటనే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదముద్ర వేసి మాలీలకు ఎస్టీ హోదా కల్పించి సామాజిక న్యాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాగీరథ, ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు ముడుపు కేదరీశ్వర్‌రెడ్డి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, కోశాధికారి గురునులే సతీష్, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ ప్రధాన్, నందు లేనగురే వివిధ కుల సంఘాల నాయకులు గడుగు శ్రీనివాస్, రమాకాంత్, మాలీ సంఘం కుల పెద్దలు గురునులే రమేష్, గురునూలే విలాస్, గురునులే గంగారాం, మారుతి గురునులే, షిండే విలాస్, మాందాడే ఉత్తం, వాడగురే మారుతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్యదర్శుల సమ్మె

- కలెక్టరేట్ ఎదుట వంటావార్పు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ పీరియడ్ ముగిసినందున తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక దీక్ష శుక్రవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు మద్దతు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించేలా వినూత్న రీతిలో వంటావార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

జేపీఎస్‌ల సమ్మెకు మాజీ మంత్రి సీఆర్ఆర్ సంఘీభావం...

అటు జేపీఎస్‌ల సమ్మె శిబిరాన్ని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిలుకూరి రామచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ దిగంబరావ్ పాటిల్ సందర్శించి, సంఘీభావం తెలిపారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నిల్పడంలో కీలక భూమిక పోషిస్తున్న కార్యదర్శుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తుందని సీఆర్ఆర్ అన్నారు. వారి సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో కేవలం సీఎం కుటుంబానికే ఉద్యోగాలు లభించాయని అన్నారు. ఇప్పటికైనా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.

సమ్మెకు ఎమ్మార్పీఎస్ నాయకుల సంఘీభావం...

గ్రామస్థాయిలో నాలుగు సంవత్సరాల నుండి పనిచేస్తున్న కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్ మాదిగ అన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. జీఓ నెంబర్ 26 ప్రకారం ప్రొబిషనరీ డిక్లేర్ చేసి సర్వీస్ బెనిఫిట్స్ కల్పించాలని అన్నారు. ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా కన్వర్ట్ చేసి వారిని రెగ్యులర్ చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని అన్నారు.

బుద్ధుడు చూపిన బాటలో నడువాలి

- ఎమ్మెల్యే జోగు రామన్న
- ఘనంగా బౌద్ధ పౌర్ణమి వేడుకలు



ఆదిలాబాద్‌టౌన్..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గౌతమ బుద్ధుడు చూపిన బాటలో నడుస్తూ ప్రశాంత జీవనం గడపాలని, ఆ మహనీయుడి ఆశయాలను ముందుకు తీసుకెళ్లే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం బౌద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని కైలాస్‌నగర్‌లోని అశోక సామ్రాట్ బుద్ధ విహార్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్, గౌతమ బుద్ధుని చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాల విశిష్టతను భావి తరాలకు తెలియచెప్పే విధంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం పట్ల అభినందనలు తెలియజేశారు. గౌతమ బుద్ధుడు సమాజ హితం కోసం తన జీవితాన్ని ధారపోశారని పేర్కొన్నారు. సమ సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మెలగాలని సూచించారు. మంచి ఆలోచనలను ముందుకు తీసుకెళ్తూ సమాజ హితం కోసం పాటు పడాలని పేర్కొన్నారు. అదేవిధంగా కార్యక్రమ నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటి చైర్మెన్ దుర్గం శేఖర్, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షులు బాబాసాహెబ్ కంబ్లె, నాయకులూ శైలందర్ వాగ్మారే, సాలికేరావు నాగరాడే, దాదాసాహెబ్ జబాడే, దయానంద్ కాంబ్లె, రవి జబాడే, మెట్టు ప్రహ్లాద్, శోభాతాయి తుల్జాపురే, దయానంద్ పోటుపుడే, రాంకిషన్ కొకేనే, గంగారాం బోరేకర్ పాల్గొన్నారు.

బేల : ఇతరులకు హని చేయడం, ఇతరులను ఇబ్బంది పెట్టకుండా ఉంటూ అన్యాయం చేయకపోవడమే నిజమైన భక్తికి నిర్వచనమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని మనియార్‌పూర్ గ్రామంలోని బుద్ధ విహార్‌లో ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బౌద్ధ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. సచివాలయం వద్ద 125 అడుగుల ఎత్తైన భారీ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్ధవంతమైన పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇతరులకు అన్యాయం చేయకపోవడమే అసలైన భక్తి అని అన్నారు. ఆ దిశగా మంచి ఆలోచనలతో ప్రతి ఒక్కరూ సమసమాజం కోసం పాటు పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, సర్పంచ్ వాడ్కర్ తేజరావ్, బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రె, దేవన్న, సతీష్ పవార్, ప్రమోద్‌రెడ్డి, మస్కె తేజరావ్, సర్పంచ్‌లు వట్టిపెల్లి ఇంద్రశేఖర్, విపిన్ ఖోడే, విఠల్ వరాడే, ఠాక్రె తనుబా, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోకేశ్వరం : మండల కేంద్రంలోని మన్మద్ గ్రామంలో బుద్ధ పూర్ణిమ సందర్భంగా శుక్రవారం గౌతమ బుద్ధుని జయంతి వేడుకలను ఎంపీపీ లలిత భోజన్న పూలమాలవేసి వందనం చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతమ బుద్ధిని బోధనలు, ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని, బుద్ధుడు తన 29వ యేటనే తన కుటుంబాన్ని వదిలి ప్రపంచంలో ప్రజల కష్టాలకు కారణాలు కనుగొని వాటిని నివారించే సత్యాన్వేషణ కోసం సన్యాసం స్వీకరించాడని అన్నారు. ఈ క్రమంలో ఆయన కఠోర తపస్సు చేశాడు. ఆ తర్వాత సన్యాసం నిరార్ధకమని భావించి వదిలేశాడని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత భోజన్న, మన్మద్ గ్రామ సర్పంచ్ శేఖర్ రెడ్డి, పోట్పెల్లి గ్రామ సర్పంచ్ రేఖాబాయి లక్ష్మణ్, మన్మద్ ఉప సర్పంచ్ రమేష్, వీడీసీ సభ్యులు భోజారెడ్డి, కొత్తూరు భోజన్న, నాయకులు శంకర్ గౌడ్, మహేందర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



లోకేశ్వరం..

ఆలయ అభివృద్ధికి కృషిచేస్తాం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ మండలంలోని కాల్వ శ్రీలక్ష్మీ నర్సింహా స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరైన మంత్రి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, నర్సింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి కళ్యాణోత్సవాన్ని తిలకించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలోని ఏకైక నర్సింహ స్వామి ఆలయం కాల్వ గ్రామంలో ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయాన్ని సీఎం కేసీఆర్ రూ.1200 కోట్లతో కృష్ణ శిలలతో నిర్మించి తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చేశారని తెలియజేశారు. స్వరాష్ట్రంలో ఆలయాలకు మహర్దశ వచ్చిందని, నిర్మల్ నియోజకవర్గంలో 900 ఆలయాల వరకు అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. కాల్వ నర్సింహ స్వామి ఆలయాన్ని రూ. 2కోట్ల 60 లక్షల నిధులతో అభివృద్ధి చేశామని అన్నారు. రూ.1కోటి నిధులతో కల్యాణ మండపాన్ని విస్తరించి, సుందరంగా నిర్మిస్తామని తెలిపారు. ఆలయానికి 5ఎకరాలు ఫారెస్ట్ ల్యాండ్ మంజూరు చేస్తామని తెలిపారు. కదిలి ఆలయానికి కూడా 10 నుండి 12 ఎకరాల ఫారెస్ట్ భూమి మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం భక్తులకు బ్రహ్మోత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాల్వ నర్సింహ స్వామి ఆలయ చైర్మెన్ నిమ్మల చిన్నయ్య, బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, ఎంపీపీ పాల్దె అక్షరా అనిల్, వైస్ ఎంపీపీ జాదవ్ బాపూరావు, కాల్వ సర్పంచ్ తిరుమల శ్రీనివాస్, సిర్గాపూర్ సర్పంచ్ ఇట్టెడి గంగారెడ్డి, న్యాలోలం సర్పంచ్ ఒడ్నం సరిత కృష్ణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సైబర్ మోసానికి పాల్పడ్డ నిందితుడు అరెస్ట్

- రూ.4 లక్షలు మాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా అవుతున్నాయని ఈ విషయమే ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్ స్టేషన్ సీఐ పురుషోత్తం సూచించారు. ఇలాంటి సంఘటనలో ఒక నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆయన శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒక బ్యాంకులో మార్కెటింగ్ ప్రతినిధిగా పనిచేస్తూ మానేసిన గుంటూరుకు చెందిన షఫీ అనే వ్యక్తి ఆదిలాబాద్ రేడియో స్టేషన్‌లో పనిచేసే వెంకటయ్యకు బ్యాంకు క్రెడిట్ కార్డు గతంలో అందించాడు. అనంతరం ఏప్రిల్ 25న క్రెడిట్ కార్డు పాయింట్లు పెంచుతానని చెప్పి అతని వద్ద ఉన్న ఫోన్ తీసుకొని అందులో రెండు యాప్‌లు డౌన్లోడ్ చేశాడు. అనంతరం అదే రోజు ఆ యాప్‌ల ఆధారంగా వెంకటయ్య ఖాతా నుంచి నాలుగు లక్షలు మాయమయ్యాయి. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న బాధితుడు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి వెంటనే రంగంలో దిగి షఫీని అరెస్ట్ చేశారు.



ఎంపీపీ గండ్రత్ రమేష్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ ఎంపీపీ గండ్రత్ రమేష్ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు హజరయ్యారు. కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ జన్మదిన వేడుకల్లో ఎంపీడీఓ శంకర్, ఈజీఎస్ సిబ్బంది, జందాపూర్, యాపల్‌గూడ, పొచ్చెర గ్రామాల నాయకులు, సర్పంచ్ పెందూరు గంగారాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాసర ఆలయంలో భక్తుల సందడి



నవతెలంగాణ-బాసర

సరస్వతిదేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. అమ్మవారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుండి భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి నది తీరాన గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు చిన్నారులు అమ్మవారి దర్శన, అక్షరాభ్యాస క్యూలైన్‌లో బారులు తీరారు. అమ్మవారి అక్షరాభ్యాస మండపాలలో భక్తులు తమ చిన్నారులకు ఆలయ అర్చకులచే ప్రత్యేక అక్షరాభ్యాస పూజలు జరిపించి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి అన్నదాన సత్రంలో భక్తులకు ఆలయం తరపున ఉచిత అన్నదాన ప్రసాద వితరణ చేశారు. అక్షరాభ్యాస పూజలు లడ్డు ప్రసాదాల విక్రయాల ద్వారా ఆలయానికి రూ.10 లక్షల వరకు ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

అమ్మవారి సన్నిధిలో సినీ కమెడియన్ పూజలు...

సరస్వతి అమ్మవారి సన్నిధిలో శుక్రవారం సినీ కమెడియన్ మహేష్, కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో తన కూతురికి అక్షరాభ్యాస పూజలు జరిపించారు. వీరిని ఆలయ అధికారులు ఆలయం మర్యాదలతో సత్కరించారు.

బీజేవైఎం నాయకులు అరెస్ట్

- నిరసనను స్వాగతించిన సాజిద్ ఖాన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే బజరంగ్‌దళ్ సంస్థను నిషేధిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టడాన్ని నిరసిస్తూ ఆదిలాబాద్‌లో బీజేవైఎం నాయకులు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్ నివాసం ఎదుట సామూహిక హనుమాన్ చాలీసా పఠనం చేసి నిరసన వ్యక్తం చేసేందుకు శుక్రవారం పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు తమ విధుల్లో భాగంగా శాంతి భద్రతల కోసం ముందస్తుగానే సాజిద్ ఖాన్ ఇంటి ఎదుట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐతే బీజేవైఎం నాయకులను అరెస్ట్ చేయవద్దని పోలీసులకు తెలపడంతో పాటు నిరసన తెలిపేందుకు వస్తున్న బీజేవైఎం నాయకుల కోసం సాజిద్ ఖాన్ మాత్రం తన ఇంటి ఎదుట జిల్లా కాంగ్రెస్ కమిటీ తరపున బజరంగ్‌దళ్ భక్తులని ఆహ్వానిస్తు గ్రీన్ మ్యాట్ వేసి హనుమాన్ చాలీసా పఠనంకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేసి నిరసనకారుల కోసం పాలు, డ్రై ఫ్రూట్స్, మంచి నీటిని ఏర్పాట్లు చేయడం విస్మయానికి నాయకులను విస్మయానికి గురిచేసింది. అటు బీజేవైఎం నాయకులను పారాయణం చేయకుండా పోలీసులు అడ్డుకున్నారు. కాసేపు ఇరువురికి తోపులాట జరిగింది. అనంతరం వారిని పోలీసులు అరెస్ట్ చేశారు.

బ్రహ్మంగారి ఆలయంలో 12 తులాల బంగారు ఆభరణాలు చోరీ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సోనాల గ్రామ సమీపంలోని బ్రహ్మంగారి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం రాత్రి బ్రహ్మంగారి గుడిలో గుర్తు తెలియని దుండగులు ఆలయ తాళాలు పగలగొట్టి 12 తులాల బంగారు ఆభరణాలతో పాటు ఉండిలో ఉన్న పదివేల రూపాయలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని తెలిపారు. అలాగే గతంలో కూడా ఇదే ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆభరణాలు దొంగలించడం జరిగిందని తెలిపారు. ఇలా వరుసగా దొంగలు పడటంతో ఆలయ సిబ్బంది భయాందోళనలో గురవుతున్నారు.

అగ్రో ఫారెస్ట్రీ పంటలతో రైతులకు స్థిర ఆదాయం

నవతెలంగాణ-పెంబి

అగ్రో ఫారెస్ట్రీ తోటల పెంపకంతో రైతులకు సుస్థిరమైన ఆదాయం లభిస్తుందని సిర్పూర్ పేపర్ మిల్లు డీజీఎం సురేందర్ నర్కుడే తెలిపారు. శుక్రవారం లోత్రాేే తండాలో రైతులకు అగ్రో ఫారెస్ట్రీ తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పేపర్ మిల్లు డీజీఎం మాట్లాడుతూ మండల పరిధిలో నీటి వసతి లేకుండా కేవలం వర్షాధారంగా మాత్రమే సాగు చేస్తున్న భూములలో నీలగిరి, కాజూరైన, సుబాబుల్ వంటి అగ్ర ఫారెస్ట్రీ మొక్కల సాగు చేపట్టడం వల్ల ఈ మొక్కలు నీటి ఎద్దడిని కూడా తట్టుకొని మూడు సంవత్సరాలలో ఎకరానికి సుమారుగా లక్ష యాభై వేల రూపాయల వరకు స్థిర ఆదాయాన్ని అందిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు మండల పరిధిలో 80 ఎకరాల వరకు నీలగిరి తోటలు వేసుకున్నట్టు తెలిపారు. వీరికి మొక్కల కొనుగోలు కొరకు అయ్యే ఖర్చు, అలాగే గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం మొదలగు వివిధ పనులకు అయ్యే ఖర్చుల కొరకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా ఎకరానికి సుమారుగా ఇరవై ఐదు వేల నుండి ముప్పై వేల రూపాయల వరకు ఆర్థిక సహాయం కూడా అందినట్టు తెలిపారు. ఈ తోటలు వాతావరణంలోని కర్బన వాయువుల సాంద్రత ను తగ్గించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతున్నందున కార్బన్ క్రెడిట్ ఫండ్ అనే పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఎకరానికి సుమారుగా పదివేల రూపాయల అదనపు ఇన్సెంటివ్ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గత సంవత్సరం నీలగిరి తోటలు వేసుకున్న రైతులకు కంపెనీ కొనుగోలు హామీ అగ్రిమెంట్ కాపీలను అందించింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు సాంకీ బాయి, సుదర్శన్, కనిరాం, తానాజీ, రాజు, ఎంపీఓ రత్నాకర్, ఏఈఓ రాజ్ కుమార్, సీఆర్డి ఫౌండేషన్ ప్రతినిధి మహేందర్, రైతులు పాల్గొన్నారు.